# అధ్యాత్మ రామాయణం



# బాలకాండం

## 1వ సర్గం
## శ్రీరామ తత్త్వం

### శ్రీరామునికి ప్రణామాలు

దేవతల ప్రార్థనలనంగీకరించి ఈ ప్రపంచంలో సూర్యవంశంలో మానవ రూపంతో అవతరించి రాక్షస కులాన్ని రూపుమాపి కళంక రాహిత్యుడై శాశ్వత కీర్తి పొంది, అవతారం ముగించుకొని పరబ్రహ్మ స్వరూపాన్ని పొందిన జానకీపతికి నమస్కారాలు. విశ్వ సృష్టి స్థితి లయ కారకుడు, మాయాశక్తికి ఆధారుడు, ఆ మాయచేత బాధింపబడని సచ్చిదానంద శుద్ధ చైతన్య స్వరూపుడైన సీతాపతికి వందనాలు.

అధ్యాత్మ రామాయణం అన్ని పురాణాలచేత సమ్మతింపబడిన పవిత్ర గ్రంథం. ఈ పుస్తకాన్ని భక్తిశ్రద్ధలతో చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విముక్తులై శ్రీహరి పదాన్ని పొందగలిగే భాగ్యవంతులౌతారు. ముక్తి కోరేవారు దీనిని ప్రతి దినం తప్పక చదవాలి. చదివేటప్పుడు వినే వాళ్ళకి కూడా అనేక కోట్ల గోదానం చేసిన ఫలం దక్కుతుంది.

అధ్యాత్మ రామాయణం అనే గంగానది పరమేశ్వరుడనే పర్వతంలో పుట్టి శ్రీరామసాగరం చేరి ముల్లోకాలను పావనం చేస్తుంది.

## పార్వతి ప్రశ్న: శ్రీరాముడు సంసారబంధంలో చిక్కుకొన్నాడా?

పూర్వం కైలాసంలో, శత సూర్యతేజంతో ప్రకాశించే రత్న ఖచిత ఆసీనుడై ఉన్న పరమ శివుడు సిద్ధులు, ఋషులు, మునుల పూజలందుకుంటున్నాడు. అప్పుడు పార్వతి భక్తితో దేవదేవుని ఇలా ప్రశ్నించింది: "దేవా! నువ్వే విశ్వానికి ఆధారుడవు, పరమేశ్వరుడవు. పరమాత్ముడైన పురుషోత్తముని తత్త్వాన్ని నాకు ఉపదేశించు. కొన్ని రహస్య తత్త్వాలను మహాత్ములు, వారి భక్తులకు మాత్రమే బోధిస్తారు. నేను నీ భక్తురాలిని, ప్రియురాలిని. అందుకే పరంధామతత్త్వాన్ని, పరమభక్తి భావాన్ని, ప్రపంచ విషయాసక్తులపై వైరాగ్య భావాన్ని, నేను అర్థం చేసుకొనే సులభ శైలిలో క్లుప్తంగా చెప్పమని ప్రార్థిస్తున్నాను. ఇంకొక ప్రశ్న కూడా ఉంది. అఖిలలోక సారమైన శ్రీరామచంద్రుడు భక్తిపాత్రుడు. భక్తితో శ్రీరాముని పూజించి సంసారసాగరాన్ని దాటి మోక్షం సాధించుకొనగలం అనే విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ విషయంలో నాకు కొన్ని సందేహాలున్నాయి. శ్రీరాముడు ప్రకృతి గుణాలచే బాధింపబడని గుణాతీతుడైన పరమపురుషుడని చెప్పబడుతూంది. ఈ విషయాన్ని తెలుసుకొన్న ప్రజలు రేయింబవళ్ళు అతనిని పూజించి పరమపద ప్రాప్తులవుతున్నారు. కాని కొందరు అతడు పరమపురుషుడైనా, మాయశక్తి ఆవరణంచేత తానే పరమాత్ముడనే విషయాన్ని తెలుసుకోలేదనీ, ఇతరులు చెప్పడం చేతనే, తన పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొన్నాడని చెప్తున్నారు. తన పరమపురుషతత్త్వం ముందే తెలిసి ఉంటే శ్రీరాముడు సాధారణ మానవుడి వలె సీతావియోగానికి ఎందుకు విలపించాడు? తనకేర్పడిన అనేక కష్టాలకెందుకు దుఃఖించాడు? ఒకవేళ తన సత్యస్వరూపం

# అయోధ్యకాండం

## 1వ సర్గం
## శ్రీరామ నారద సంవాదం

### నారద స్తుతి

ఒకనాడు నీలమేఘ శ్యాముడైన శ్రీరాముడు సర్వాభరణాలు ధరించి, తన మందిరంలో సీత చామరం వీస్తుండగా ఆ చల్లగాలిని అనుభవిస్తూ తాంబూలం సేవిస్తూ సింహాసనంలో కూర్చొని ఉన్నాడు. అప్పుడు స్వర్గలోకం నుండి శ్రీరాముని సందర్శించడానికి నారద మహర్షి వచ్చాడు. తెల్లని స్ఫటికంవలే ప్రకాశిస్తూ శరత్కాల చంద్రుని నిర్మల తేజంతో ప్రకాశిస్తూవచ్చే నారదమహర్షిని చూచి రాముడు లేచి సీతాసమేతంగా మునికి ఎదురేగి స్వాగతం పలికి నమస్కరించి మునిని ఇలా అడిగాడు: "ముని పుంగవా! సంసారవలయంలో చిక్కుకొని ప్రాపంచిక విషయాలలో మునిగివుండే మాకు, మీబోటి మహనీయుల దర్శనం కలగడం దుర్లభం. ఏదో పూర్వజన్మలలో చేసిన పుణ్యాల ఫలితంగానే నేడు మిమ్మల్ని దర్శించుకొనే భాగ్యం మాకు కలిగింది. మీ ఈ రాకలోని ఆంతర్యాన్ని వివరిస్తే మీ కార్యాన్ని తప్పక నెరవేరుస్తాను." అందుకు బదులుగా నారదుడు "రామా! నువ్వేమో సాధారణ మానవుడిలా నన్నెందుకు

మభ్యపెడుతున్నావు. ఒక విధంగా చూస్తే నువ్వు చెప్పేది కూడా నిజమే. సంసార సాగరంలో నువ్వు కూడ మునిగే ఉన్నావు. ఈ ముల్లోకాలను మోహంలో ముంచే మాయాశక్తి నీ ఇల్లాలే కదా! చీమనుండి బ్రహ్మవరకు సృష్టించే, మాయాశక్తికి, నీ ఆశ్రయం మాత్రం చాలు. త్రిగుణాత్మకమైన ఆ మాయాశక్తి మూడు విధాలైన గుణాలు గల ప్రజలను సృష్టిస్తుంది. వారే సాత్వికులు (శుక్లవర్ణులు), రాజసికులు (లోహిత వర్ణులు), తామసులు (కృష్ణ వర్ణులు). ముల్లోకాలనే ఈ భవనానికి నువ్వే యజమానివి. నువ్వే మహావిష్ణువు, శివుడు, బ్రహ్మ, సూర్యుడు, చంద్రుడు, దేవేంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి (నైరుతీ దిశాధీశుడు), వరుణుడు, వాయువు, కుబేరుడు, రుద్రుడు. సీతయే మహాలక్ష్మి, పార్వతి, సరస్వతి, ప్రభ, రోహిణి, శచీదేవి, స్వాహాదేవి, సంయామిని, తామసి, భార్గవి, సదాగతి, సర్వ సంప్రాప్తికీర్తి, రుద్రాణి. ఇంతెందుకు క్లుప్తంగా చెప్పాలంటే లోకంలో ఉండే స్త్రీ వాచకాలన్నిటికి సీతయే సంకేతం; పురుష వాచకాలన్నిటికి నువ్వే ప్రతీక. ముల్లోకాలలో మీరిద్దరు తప్ప వేరెవరూ లేరు. నీ ప్రతిబింబం (ఆభాసం) నుండి పుట్టిందే అజ్ఞానం (అవ్యాకృతం). ఈ అజ్ఞానం నుండి మహాతత్త్వం అనే భూతశక్తి వెలువడింది. దానినుండి సూత్రాత్మ అనే విశ్వాంకురశక్తి పుట్టింది. దానినుండి సూక్ష్మదేహం వెలసింది. అహంకారం, బుద్ధి పంచప్రాణ శక్తులు, పంచేంద్రియాలు కలసిన దేహమే, పుట్టుక చావులకు సుఖదుఃఖాలకు లోనవుతుంది. దీనినే ప్రాజ్ఞులు (పండితులు) లింగ శరీరమంటారు. ఈ శరీరంలోని ఆత్మనే (పరమాత్ముని అంశం ప్రతిబింబించే చైతన్య శక్తినే) జీవి అంటారు. విశ్వరీతిగా ఈ జీవుల సమూహమే హిరణ్యగర్భ. ఈ హిరణ్యగర్భకు విశ్వమే శరీరం. దీనినే జగన్మాయ

# అరణ్యకాండం

## 1వ సర్గం

## దండకారణ్యంవైపు ప్రయాణం

### విరాధునికి మోక్షం

శ్రీరాముడు ఆ రాత్రి అత్రిమహర్షి ఆశ్రమంలో గడిపి, మరునాటి ఉదయాన మహర్షితో "మేము మునుల ఆశ్రమాలతో నిండిన దండకారణ్యానికి పోతున్నాం. మమ్మల్ని ఆశీర్వదించండి. దారి చూపటానికి మీ శిష్యులను పంపండి" అని ప్రార్థించాడు. ఆ మునిపుంగవుడు చిరునగవులు చిందిస్తూ "రామచంద్రా! దేవతలకుకూడా నువ్వే ఆశ్రయుడవు. అందరికి మార్గదర్శివి. నీకు మార్గం చూపడం ఏమిటి? అయినా లోకరీతి ననుసరించి నువ్వడుగుతున్నావు, నేను మార్గాన్ని చూపిస్తాను" అని చెప్పి తన శిష్యులను రామునికి మార్గాన్ని చూప నియమించాడు. కొద్దిదూరం అతనుకూడా వారిని అనుసరించాడు. కాని రాముడు ముని రాకను వారించాడు. మహర్షి తన ఆశ్రమానికి మరలి వెళ్ళాడు. ఒక క్రోసు దూరం పయనించిన తర్వాత వారు ఒక నదీతీరాన్ని చేరారు. శిష్యులను ఈ నదిని దాటే ఉపాయమేమని రాముడు అడిగాడు. బదులుగా శిష్యులు అక్కడొక ఉత్తమమైన నౌక ఉందని ఆ నావలో

సీతారామలక్ష్మణులను ఆ దరికి చేరుస్తామని చెప్పారు. ముగ్గురూ నావనెక్కారు. మునికుమారులే నావను నడిపి వారిని ఆవలి గట్టుకు చేర్చారు. రాముడు వారు నావను నడిపిన తీరును ప్రశంసించాడు. మునికుమారులు వెను తిరిగారు.

సీతారామలక్ష్మణులు దట్టమైన వనంలో ప్రవేశించారు. అక్కడ క్రిమి కీటకాలు నిండుగా ఉన్నాయి. అనేక విధాలైన మృగాలు సంచరిస్తున్నాయి. సింహాలు పులులు మొదలైన క్రూరమృగాలు, నరమాంసం తినే ఘోర రూపాలుగల రాక్షసులు ఆ అడవిలో తిరుగుతున్నారు. ఆ దండకారణ్యం భయంకరంగా ఉన్నది. గగుర్పాటు కలుగజేస్తుంది. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణుడితో ఇలా చెప్పాడు: “సౌమిత్రీ! ఇక మనం బహు జాగ్రత్తగా ప్రయాణం చేయాలి. నువ్వు విల్లు అంబులతో కడుజాగరూకుడవై ఉండాలి. మొదట నేను, నా వెనుక సీత, సీత వెనుక నువ్వు ఉండాలి.” రాముడు చెప్పిన తీరు ఎలా ఉన్నదంటే మొదట పరమాత్మ మధ్య మాయాశక్తి చివర జీవాత్మ. మళ్ళీ రాముడు లక్ష్మణుడితో “పరిసరాలను జాగ్రత్తగా చూస్తూండు. ఎందుకంటే దండకారణ్యంలో రాక్షసులన్నిచోట్ల తిరుగుతుంటారని విన్నాను.” ఈ విధంగా మాట్లాడుకుంటూ ఒకటిన్నర క్రోసు దూరం నడచారు. వారొక కొలను కడకేగారు. ఆ కొలను కమలాలు, కుముదాలతో నిండి ఉంది. ఆ సరోవరంలోని నీళ్ళు చల్లగా తేటగా ఉన్నాయి. ఆ చల్లని జలాన్ని తాగి చెట్టునీడలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకొన్నారు. అప్పుడు వారికొక భయంకర రూపం కనబడింది. పొడుచుకుని వచ్చే కోరలతో బిగ్గరగా అరుస్తూ వచ్చింది ఆ రూపం. ఆ శబ్దం వనమంతా ప్రతిధ్వనించింది. ఎడమచేతిలోని శూలంలో అనేక మానవ కళేబరాలు వేలాడుతున్నాయి. చేతికి చిక్కిన ఏనుగులను పులులను

# కిష్కింధకాండం

## 1వ సర్గం
## సుగ్రీవునితో సఖ్యం

### హనుమంతుడు రాముని కలుసుకొనటం

శబరి సూచించిన మార్గంలో వెళ్ళి రామలక్ష్మణులు పంపా సరోవర తీరం చేరారు. విస్తారమైన ఆ సరోవరం విస్తీర్ణం రమారమి ఒక క్రోసు ఉంది. లోతుగాకూడ ఉంది. కొలనులోని జలం నిర్మలంగా ఉంది. వికసించిన కమలాలతో కుముదాలతో నీలోత్పలాది పుష్పాలతో నిండి నయనానందకరంగా ఉంది. హంసలు చక్రవాకాలు రమ్యంగా ఆ సరస్సులో ఆడుకుంటూ ఉన్నాయి. కుక్కుట, క్రౌంచాది నీటి పక్షుల కిలకిలారావాలు వీనులవిందును కలిగిస్తున్నాయి. ఆ జలాశయతీరం అనేక రకాల పువ్వులు నిండిన చెట్లతో, ఫలవృక్షాలతో చూడముచ్చట కలిగిస్తోంది. ఆ పువ్వులు వెదజల్లే పరిమళాలు ఆ ప్రాంతాన్నంతా వ్యాపించాయి. ఆ నిర్మలకాసారంలో రామలక్ష్మణులు కాళ్ళు చేతులు కడుగుకొని ఆ తియ్యని నీటిని తాగి, సేద తీర్చుకొని ఆ చల్లని తీరంవెంబడి నడిచారు.

జటామకుటధారులై, నార చీరలు కట్టుకొని, ధనుర్ధారులై, రామలక్ష్మణులు మందమందంగా వీచే పరిమళ పవనాలను శ్వాసిస్తూ,

కన్నులకు విందు కలిగించే ఆ ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ చెట్లను అల్లుకొన్న లతల శోభను వీక్షిస్తూ పక్షులగానాన్ని వింటూ సరోవరతీరాన్ని దాటారు.

ఋష్యమూక పర్వతం మీద నలుగురు మంత్రులతో కూడివున్న సుగ్రీవుడు దూరంనుంచి రామలక్ష్మణుల ఆగమనాన్ని చూశాడు. చూసిన వెంటనే అతడిలో భయం పుట్టుకొచ్చింది. తన మంత్రియైన ఆంజనేయునితో "హనుమా! అక్కడ చూడు ఎవరో ఇద్దరు మనకొండవైపే వస్తున్నారు. నువ్వు బ్రహ్మచారి వేషంలో పోయి వారి వృత్తాంతాన్ని పూర్తిగా తెలుసుకొనిరా! నన్ను చంపడానికి వాలిచేత పంపబడ్డారా అని కనుక్కో. వారు దుష్టబుద్ధితో వచ్చి ఉంటే అక్కడనుండే చేతితో సంకేతం చేయి. వారితో తియ్యని మాటలు పలికి సంగతి సందర్భాలు తెలుసుకొనేటప్పుడు వినయవిధేయలతో మెలగు" అన్నాడు. సుగ్రీవుని ఆజ్ఞమేరకు హనుమంతుడు బ్రహ్మచారివేషంలో రాముని దగ్గరికిపోయి పాదాభినందనంచేసి వినయంగా ఇలా ప్రశ్నించాడు: "పుణ్యపురుషులారా! తమరెవ్వరు? యువకులైన మీ ముఖాలలో బల, వీర, పరాక్రమాలు కొట్టవచ్చినట్లుగా కనబడుతున్నాయి. సూర్యచంద్రులకు సమమైన మీ తేజం దశదిశలను ప్రకాశింపచేస్తోంది. జగన్మాయ నాశ్రయించి విశ్వసృష్టి స్థితిలయ కార్యాలు చేసే ప్రధాన పురుషుడు, మానవాకృతిదాల్చి లోకసంరక్షణానికై ఈ భువికి దిగి వచ్చాడా అనిపిస్తోంది. భూభారాన్ని తొలగించడానికి, భక్తులను అనుగ్రహించడానికి లీలామానుష విగ్రహస్వరూపంతో ఈ అవనిలో తిరుగుతున్నారా! అని తోస్తుంది. మీరు క్షత్రియాకృతిలో అవతరించిన పరమ పురుషులుగానే కనబడుతున్నారు. సర్వజీవ హృదయ కమలాలలో నివసించే పరమాత్ముడో లేక సర్వస్వతంత్రులైన

# సుందరకాండం

## 1వ సర్గం

## హనుమంతుని సముద్ర లంఘనం

### హనుమంతుని సన్నాహం

వాయుపుత్రుడైన ఆంజనేయుడు నూరు యోజనాల విస్తీర్ణమైన మహాసాగరాన్ని లంఘించడానికి కుతూహలుడై పరమాత్ముడైన శ్రీరాముని స్మరించి, ధ్యానించి, పరమానందంతో "వానరవీరులారా! అమోఘమైన రామబాణమెలా దూసుకొని పోతుందో ఆ విధంగా ఉంటుంది నా గగనతల ప్రయాణం. నా వేగాన్ని మీరందరు ఇప్పుడే చూస్తారు. సీతమ్మ క్షేమ సమాచారాన్ని తెలుసుకొని నా కార్యాన్ని సాధించానని శ్రీరామునికి చెప్తాను. ప్రాణం పోయేటప్పుడు ఎవని నామాన్ని స్మరిస్తే, ఈ సంసార సాగరాన్ని దాటి అతని పరమపదం చేరుతామో, ఆ శ్రీరామునికి దూతగా అతని పేరు చెక్కిన ఉంగరాన్ని తీసుకొనిపోయే నాకు ఈ సముద్రాన్ని దాటడం ఒక స్వల్ప విషయమే. శ్రీరాముని నా హృదయంలో ధ్యానిస్తూ ఈ మహాసముద్రాన్ని అవలీలగా దాటుతాను" అని చెప్పి హనుమంతుడు తన భుజాలను పెంచుకొని, మెడను సారించి, శరీరాన్ని సాగదీసి, పాదాలను ముడుచుకొని, తోకను పెంచుకొని చూపులను పైకెత్తి భీమవిక్రముడై దక్షిణదిక్కువైపు ప్రయాణాన్ని సాగించడానికి ఆకాశానికెగిరాడు.

## సురస వృత్తాంతం

వాయువేగంతో పోయే హనుమంతుణ్ణి నింగినుండి దేవతలు చూశారు. అతని బలాన్ని పరీక్షించాలనే ఉద్దేశంతో వారిలో వారిలా మాట్లాడుకొన్నారు: "మహాపరాక్రమశాలియైన ఈ వానరుడు వాయువేగంతో ప్రయాణిస్తున్నాడు. కాని లంకానగరాన్ని చేరే శక్తి ఉందో లేదో తెలియదు." వారు తమలో తాము ఇలా చర్చించుకొని నాగమాతయైన సురసను పిలిచి ఆమెతో ఇలా అన్నారు: "నువ్వు ఆంజనేయుని పయనానికి ఆటంకాలు కలిగించి అతని బుద్ధిని, బలాన్ని పరీక్షించి రా!" నాగమాత అలాగేనని ఆంజనేయుని పయనానికి విఘ్నం కలిగించేరీతిగా అతనికి ఎదురుగా నిలిచి "వానరవీరా! ఆకలితో పీడింపబడే నాకు నిన్ను ఆహారంగా దేవతలు నిర్ణయించారు. కాబట్టి నా నోటిలో ప్రవేశించు" అని చెప్పి తన నోరు తెరిచింది. బదులుగా హనుమంతుడు "అమ్మా! నేను రామకార్యం మీద పోతున్నాను. జానకి జాడ తెలుసుకొని, రామునికి ఆమె కుశలాన్ని తెలిపి పిదప నీకు ఆహారమవుతాను. నీకు నమస్కారాలు. దారి వదలు" అన్నాడు. "నాకా విషయాలేమీ తెలియవు. ఇప్పుడు నువ్వు నాకు ఆహారమవ్వాలి. లేకపోతే నేనే నిన్ను భక్షిస్తాను" అని సురస చెప్పింది. "అలాగయితే నీ నోరు తెరు" అని చెప్పి హనుమంతుడు తన దేహాన్ని ఒక యోజనదూరం పెంచాడు. సురస, తన నోటిని ఐదు యోజనాల దూరానికి పెంచింది. ఇలా ఇద్దరూ తమ దేహాన్ని పెంచుకొంటూ పోయారు. చివర సురస తన నోటిని యాభై యోజనాలకు పెంచింది. వెంటనే వివేకవంతుడైన మారుతి తన దేహాన్ని బొటన వ్రేలంత చిన్నదిగా చేసుకొని సురస నోటిలో దూరి తిరిగివచ్చి ఆమెతో 'అమ్మా! నీ కోరిక మేరకు నీ నోటిలో ప్రవేశించి తిరిగి వచ్చాను. నీకు నా నమస్కారాలు" అన్నాడు. "హనుమా! నువ్వు

# యుద్ధకాండం

## 1వ సర్గం
## వానరసైన్య దండయాత్ర

### సుగ్రీవ ఆంజనేయులతో శ్రీరాముని సంప్రతింపులు

హనుమంతుడు లంకలో సాధించిన ఘనవిజయానికి సంతోషించిన శ్రీరామచంద్రుడు, మారుతిని గాఢంగా కౌగిలించుకొని ఇలా అన్నాడు: "దేవతలు కూడా సాధించజాలని కార్యాన్ని మారుతి సులభంగా సాధించాడు. ఆ కార్యం ఇతరులకు ఊహించడానికి కూడా శక్యం కానిది. నూరు యోజనాల విస్తీర్ణమైన సాగరాన్ని ఆకాశమార్గంలో లంఘించడం ఎవరికి సాధ్యం? రాక్షస వీరులచే కాపాడబడే లంకానగరంలో ప్రవేశించి ఆ నగరాన్నే నాశనం చేయడం ఎవరికి వీలవుతుంది? స్వామి సేవాపరాయణుడైన ఆంజనేయుడు తన కార్యాన్ని చక్కగా సామర్థ్యంతో నిర్వహించాడు. ఈ లోకంలో అట్టి కార్యదక్షుడు ముందు లేడు ఇక ఉండబోడు ('న భూతో న భవిష్యతి') ఆంజనేయుడు సీతను కలుసుకొని రావడంచేత, నా గౌరవం, సౌమిత్రి గౌరవం, సుగ్రీవుని గౌరవం ఇంత ఏల, రఘువంశ గౌరవమే కాపాడబడింది. సీతాన్వేషణ కార్యం శుభంగా ముగిసింది. ఇక మనం ఆలోచించవలసింది ఈ మహాసాగరాన్ని ఎలా

దాటడం. ఇదే నాకు కొంత చింతను కలిగిస్తోంది. శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటి వానరులందరు లంకలో ఎలా ప్రవేశిస్తారు? అప్పుడే కదా మనం సీతను చెరనుండి విడిపించుకోగలం." శ్రీరాముని మాటలకు సుగ్రీవుడు "రఘువరా! ఈ సముద్రాన్ని ఎలాగైనా దాటగలం. లంకా నగరాన్ని ముట్టడించి రావణుని సంహరిస్తాం. ఇది నీ వంటి వీరుడు సందేహించవలసిన విషయం కాదు. కాబట్టి చింతను వీడు. ఇక్కడుండే వీరులు, శూరులు, బలవంతులైన వానరులను చూడు. వీరు నీకై సముద్రాన్ని దాటడమే కాదు. నిప్పులో దూకడానికి కూడా సంసిద్ధంగా ఉన్నారు. సముద్రాన్ని దాటే ఉపాయాన్ని ఆలోచిద్దాం. సాగరాన్ని దాటామంటే రావణ సంహారం నిశ్చయం. నువ్వు విల్లు పట్టుకొని యుద్ధంలో దిగితే నిన్ను ఎదిరించి పోరాడగలవారు ఈ ముల్లోకాలలో ఎవరూ లేరు. ఎల్లచోట్ల మన విజయాన్ని సూచించే శుభశకునాలే చూస్తున్నాను" అని పలికాడు. భక్తిసమన్వయమైన సుగ్రీవుని వీర వచనాలు విన్న శ్రీరాముడు హనుమంతుణ్ణి చూసి ఇలా ప్రశ్నించాడు: "ఏదో విధంగా సముద్రాన్ని దాటుతాం. దేవదానవులు కూడా ప్రవేశించడానికి సాధ్యంకాని లంకానగరాన్ని వర్ణించు. ఈ వివరాలు తెలుసుకొన్న తర్వాత మనం చెయ్యవలసిన వ్యూహాలను గురించి ఆలోచిద్దాం." శ్రీరాముని ప్రశ్నకు బదులుగా ఆంజనేయుడు చేతులు జోడించుకొని వినయంతో ఇలా చెప్పాడు: "దేవా! నేను చూచిన లంకానగరాన్ని వర్ణిస్తాను. అందమైన లంకానగరం త్రికూట పర్వతం పైన నెలకొనివుంది. ఆ నగరంలో భవనాలు, ప్రాకారాలు బంగారు రంగులో ప్రకాశిస్తున్నాయి. నగరంచుట్టూ నిర్మలోదకంతో నిండిన అగడ్తలున్నవి. సువాసనలు వెదజల్లే పూలతో శోభించే ఉద్యానవనాలు, కమల కుముదాలు వికసించే విశాలతటాకాలు,

అనుబంధం

# అధ్యాత్మ, వాల్మీకి రామాయణాలు:
## భేదాలు - మార్పులు - వ్యక్తీకరణలో తేడాలు

ఈ కావ్య ఉపోద్ఘాతంలో చెప్పినట్లుగా వాల్మీకి, అధ్యాత్మ రామాయణాలు రెండూ ఒకే రామకథను చెప్పినా రెండూ విభిన్న కోణాలలో చర్చించి రెండు దృక్పథాలలో ప్రతిపాదింపబడివున్నాయి. మొదటిది రాముని దివ్యత్వాన్ని ఒప్పుకొన్నా అతనిని ఒక ఆదర్శమానవునిగానే చిత్రించింది. రెండవది రాముని పరబ్రహ్మము యొక్క అవతారమని, ఆ విషయం రామునికి తెలుసనీ వర్ణించటమేగాక జ్ఞానులు రాముని పరమాత్మగా గుర్తించారని కూడా చెబుతుంది. కథాసన్నివేశాలు ఒకటే అయినప్పటికీ దృక్పథభేదం విస్తారం అవటంతో, వాల్మీకి రామాయణంలో విపులీకరించిన అనేక సన్నివేశాలు, సంవాదాలు దీన్లో చోటు చేసుకోలేదు. ఈ విషయం మనకు అప్రస్తుతం. కాని రామావతార తత్త్వ రహస్యాలను తేటతెల్లపరచే ప్రధాన అధ్యాత్మ విషయాలను వివరంగా తెలుసుకొనటమే ఇక్కడ మన లక్ష్యం. ఈ కావ్యాలలోని ముఖ్యభేదాలను మాత్రం మనం కాండంవారీగా విశ్లేషిద్దాం.

### బాలకాండం

1. బ్రహ్మ తదితర దేవతల ప్రార్థనను మన్నించి రావణ సంహారానికై, మహావిష్ణువు దశరథుని తనయుడుగా మర్త్యావతార మెత్తిన విషయం రెండు కావ్యాలూ ఒప్పుకొంటాయి. కాని వాల్మీకి ఈ అవతార

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Adhyatma+Ramayanam**

* * *